క్లుప్తంగా

మల్బరీ తోటలకు చీడ



మల్బరీ తోటకు ఆశించిన చీడ పురుగులు

మడకశిరరూరల్: ఉష్ణోగ్రత తక్కువగా ఉండడడం, గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండటంతో మల్బరీ తోటలకు వివిధ రకాల చీడపురుగులు ఆశిస్తున్నాయని రైతులు తెలిపారు. పెరుగుతున్న ఆకుల రసాన్ని పురుగులు పీల్చివేసి నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు. దిగుబడిపై కూడా ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టు పరిశ్రమశాఖ ఏడీఏ రాజు మాట్లాడుతూ మల్బరీ తోటకు వ్యాపించిన లీఫ్ లోలర్ చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు సేఫ్ గార్డు (ఆర్గానిక్) మందును పిచికారీ చేయాలన్నారు. వారం తర్వాత ఆకును పురుగులకు ఉపయోగించవచ్చన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సిద్దేశ్వర తెలిపారు. హేమావతి, నిద్రగట్ట పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరాఫరా ఉండన్నారు. గృహ వినియోగదారులు, రైతులు గమనించాలని కోరారు.

రికార్డులు పక్కాగా నిర్వహించండి



చిలమత్తూరు పీహెచ్‌సీ సిబ్బందితో డీఎంహెచ్ఓ మంజువాణి

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ మంజువాణి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం కాన్పుల గది, ల్యాబొరేటరీ, మందుల గది తనిఖీ చేశారు. తర్వాత సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి ప్రతిరోజూ మూడు సార్లు ఎఫ్ఆర్‌సీ హాజరు వేయాలన్నారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డా. తేజశ్విని, సీహెచ్ఓ జయచంద్రకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగలు ?

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి వద్ద తల దాచుకున్న దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ స్థానికంగా వారు తలనదాచుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇంకా దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు చెబుతున్నారు.

సజావుగా మున్సిపల్ దుకాణాల వేలం



దుకాణాల వేలం నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక మున్సిపల్ దుకాణాల బహిరంగ వేలం ప్రక్రియ ఎట్టకేలకు బుధవారం ముగిసింది. 12 సంవత్సరాలకోసారి నిర్వహించే బహిరంగ వేలం ప్రక్రియ కొన్ని న్యాయపర కారణాలతో ఈ సారి 24 సంవత్సరాల తర్వాత నిర్వహించారు. 32 దుకాణాలకు నిర్వహించిన బహిరంగ వేలం సజావుగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్ మాట్లాడుతూ ఈసారి గతంలో కంటే అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. గతంలో ప్రతి నెల రూ 38,720 బాడుగ వచ్చేదని, ఇప్పుడు ప్రతి నెలా రూ.3,02,810 బాడుగ రూపంలో మున్సిపాల్టీకి ఆదాయం వస్తుందన్నారు. మూడు విడతలుగా నిర్వహించిన దుకాణాల వేలంలో మొత్తం రూ 13,57,810 ఆదాయం వచ్చే అవకాశ ముందన్నారు.

పదోన్నతి పొందిన ఏఎస్ఐకి సన్మానం



నజీర్ అహ్మద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: కియా పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ పనిచేస్తున్న నజీర్ అహ్మద్‌కు ఇటీవల ఎస్ఐ పదోన్నతి లభించింది. పెనుకొండ సబ్ డివిజన్ రోడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేసినట్లు ఉత్తర్వులు వెలువడటంతో బుధవారం కియా పీఎస్ ఎస్ఐ రాజేస్, సిబ్బంది... నజీర్ అహ్మద్‌ను ఘనంగా సత్కరించారు.

సాయం చేయరు.. విత్తనం ఇవ్వరు !



ట్రాక్టర్‌తో పంట సాగుకు భూమిని దున్నుతున్న దృశ్యం

'అన్నదాత సుఖీభవ' పేరుతో ఒక్కో రైతుకు ఏడాది రూ.20 వేలు సాయం అందిస్తామని కూటమి నాయకులు ఎన్నికలకు ముందు హామీ గుప్పించారు. తీరా అధికారం చేపట్టి ఐదు నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం ఆ హామీని మాత్రం నేటికీ అమలు చేయడం లేదు. దీంతో రైతులు రబీ సీజన్‌లో కూడా అప్పులు చేసి పంటలు వేసేందుకు సిద్ధమవ్వాల్సిన దుస్థితి నెల కొంది.

- రబీ సీజన్ మొదలవుతున్నా సబ్సిడీ విత్తనాలు అందించని కూటమి ప్రభుత్వం
- నేటికీ అందని రూ.20 వేల సాయం
- అప్పులు చేసి పంటలు పెడుతున్నామని కర్షకుల ఆవేదన

మడకశిర రూరల్: ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, అల్పపీడనం ప్రభావంతో వేరుశనగ పంట సాగు రైతులకు నష్టాన్ని మిగిల్చింది. ఇతర పంటలు కూడా దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల సాయం అందించకపోవడంతో అప్పుడు కూడా రైతులు అప్పులు చేసి పంట పెట్టగా నష్టపోయారు. అటు పంటలు చేతికి అందక పెట్టిన పెట్టుబడి కూడా తిరిగిరాలేదు. తాజాగా రబీ సీజన్‌లో అయినా అన్నదాత సుఖీభవ సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఆశగా ఎదురు చూసినా రైతులకు నిరాశే ఎదురైంది. దీనికితోడు రబీ సీజన్‌లో పంటల సాగుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న పంట సాగుకు విత్తనం కొరత పట్టి పీడిస్తోంది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట చేతికి రాకపోవడంతో వేరుశనగ విత్తనం కొరత ఏర్పడింది. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనంపైనే రైతులు ఆధారపడ్డారు. అయితే ఇంత వరకూ నియోజకవర్గానికి వేరుశనగ విత్తనం పంపిణీ చేయలేదు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలతో పాటు విత్తన వేరుశనగ కూడా అందించకపోవడంతో ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధిలేక అప్పులు చేసి రబీ పంటను సాగు చేసే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భేష్

రైతుల అభ్యున్నతి కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా- పీఎం కిసాన్ పథకాన్ని ప్రకటించింది. ఏటా ప్రతి రైతుకు రూ.13,500 చొప్పున ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభానికి ముందే మే, అక్టోబర్, జనవరి నెలల్లో పెట్టుబడి సాయం అందించారు. దీంతో పంట సాగుకు రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండానే పంటలు సాగు చేసుకునే వారు. ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించడంతో ఎక్కడా కర్షకులకు ఇబ్బందే లేకుండా పోయింది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.

డిసెంబర్ 15 వరకు అనుకూలం

రబీ సీజన్‌లో విత్తనం వేయడానికి నెల రోజుల పాటు అనుకూలంగా ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈనెల 20 నుంచి డిసెంబర్ 15 వరకూ రబీలో వేరుశనగ విత్తనం వేయడానికి అనువైన సమయం. ఆత ర్వాత వేసినా పంట దిగుబడి రాదని భావిస్తున్నారు. రైతులు విత్తనం వేయడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే విత్తనం లేదు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన కాలయ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

మడకశిర నియోజకవర్గంలో రైతుల సంఖ్య

మడకశిర	- 11,875
అగళి	- 6,589
అమరాపురం	- 10,101
రొళ్ల	-6,609
గుడిబండ	-8,360
మొత్తం రైతుల సంఖ్య	-43,534

సబ్సిడీ విత్తనాలు ఇచ్చేదెన్నడు?



కూటమి నాయకులు ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ కింద రైతు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఐదునెలలకు పైన అయినా పెట్టుబడి సాయం అందించలేదు. రబీలో పంటల సాగుకు రూ. 50 వేల అప్పు చేసి రాగి, వేరుశనగ, మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలను 8 ఎకరాల్లో సాగు చేయాల్సి పరిస్థితి ఉంది. ప్రభుత్వం అందించే విత్తనం కోసం ఎదురు చూస్తున్నా. అయితే ఇంత వరకూ పంపిణీ చేయలేదు. ఎప్పుడు అందిస్తారో తెలీదు.

– శ్రీరామరెడ్డి, ఎల్లోటి, మడకశిర మండలం

పంట సాగుకు అప్పులు చేయాల్సిందే..



కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను నేటికీ ఇవ్వకపోవడంతో అప్పులు చేసి రబీలో పంటలను సాగు చేస్తున్నాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభానికి ముందే రైతులు పంట సాగుకు ఇబ్బంది పడకుండా రైతు భరోసా సాయం ఖాతాలోకి జమ చేసి పంటల సాగును ప్రోత్సహించేది. కానీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీను కూడా అమలు చేయకపోవడంతో పంట సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది.

– మల్లికార్జున, రైతు కేతేపల్లి, మడకశిర మండలం

ఇచ్చిన మాట నిలుపుకోవాలి



కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వీడి చెప్పిన విధంగా అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం రూ.20 వేలను రైతుల ఖాతాల్లో జమ చేయాలి. రబీ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం ఖాతాలోకి జమ చేయకపోవడంతో అప్పులు చేసి పంటలను సాగు చేయాల్సి ఉంది. సబ్సిడీ విత్తన పంపిణీ కూడా మొదలు కాకపోవడంతో రైతులందరూ ఆందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

– నర్సేగౌడ్, ఆర్.ఆనంతపురం, మడకశిర మండలం

డీవీ రమణకు ఘన నివాళి



డీవీ రమణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పరిగి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి, పెనుకొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ డీవీ రమణ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. బుధవారం ఆయన భౌతికకాయాన్ని పైడేటికి తీసుకొచ్చారు. మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పైడేటికి వచ్చి డీవీ రమణ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీకి రమణ చేసిన సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు రమణ మృతికి సంతాపం తెలిపారు.

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని శివానగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నవకోటి శివ తండ్రి, మాజీ ఎంపీటీసీ నారాయణప్ప మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ శివానగర్‌కు వెళ్లి నారాయణప్ప మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగిరెడ్డి మాతృమూర్తి నాగలక్ష్మమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం శెట్టిపల్లిలో వైకుంఠ సమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ హాజరై నాగలక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శుభకార్యం

పరిగి: మండలంలోని కాలువపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ రాజు సోదరుడు దినేష్‌కుమార్ వివాహం దివ్యశ్రీతో బుధవారం జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట మండల నాయకులు ఉన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టురూకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లిరెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మల్లిరెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ నాగరత్నమ్మ, దుర్గప్ప, రవి,నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసు కొట్టివేత



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఆనందాన్ని పంచుకుంటున్న న్యాయవాది గోవర్ధన్‌రెడ్డి

మడకశిర: అగళి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై నమోదైన కేసును బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొట్టివేసినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది వైసీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలీసులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అప్పట్లో తప్పుడు కేసు నమోదు చేసి వేధించారన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేసినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై నమోదవుతున్న తప్పుడు కేసులపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలు భయపడకుండా పార్టీ కోసం పని చేయాలని కోరారు. తమకు న్యాయం చేసిన న్యాయవాది గోవర్ధన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.



హిందూపురం: విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



పెనుకొండలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన

హిందూపురం అర్బన్: కర్నూలు నుంచి లోకాయుక్త, మానవహక్కుల న్యాయ స్థానాలను అమరావతికి తరలింపుకు నిర్ణయం తీసుకోవడం తగదని స్థానిక న్యాయవాదులు తెలిపారు. బుధవారం బార్ అసోషియేషన్ కార్యాలయంలో సమావేశమైన న్యాయవాదులు ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. బుధవారం నుంచి మూడు రోజులు విధులు బహిష్కరించాలని నిర్ణయించారు. అనంతరం అసోషియేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, సిద్దూ, శివశంకర్, మురళి, సంపత్‌కుమార్, ఉదయ్‌సింహారెడ్డి, సుధాకర్, మనోహర్‌రెడ్డి, ఆసిఫ్, ఆంజనేయులు, మనోహర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: కర్నూలు నుంచి లోకాయుక్త, మానవహక్కుల న్యాయ స్థానాల తరలింపును వ్యతిరేకిస్తూ పెనుకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు, న్యాయవాదులు వాల్మీకి శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, మోహన్‌నాయక్, హరి, బాలాజి, జావేద్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



పరిగి: మాట్లాడుతున్న తహసీల్దారు హసీనా సుల్తానా

పరిగి: భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హసీనా సుల్తానా తెలిపారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో బుధవారం రెవెన్యూ శాఖ పరమైన భూ సమస్యల పరిష్కార ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు.

అమరాపురం: మండల పరిధిలోని నిద్రగట్ట గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో 12 వినతులు వచ్చినట్లు రెవెన్యూ అధికారి రజిత తెలిపారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని హారేసముద్రం గ్రామ సచివాలయంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ మురళీధర్‌కు భూ సమస్యలున్న రైతులు అర్జీలను అందజేసి ఆలస్యం చేయకుండా పరిష్కార మార్గం చూపాలని కోరారు.

రొళ్ల: మండల పరిధిలోని గుడ్డగుర్కి సచివాలయం ఆవరణలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం బుధవారం గ్రామసభను నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి మాట్లాడుతూ భూ సమస్యలు ఏమైనా ఉంటే గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు చేపల చెరువుల వేలం

రొళ్ల: మండలంలోని కాకి, కె.బ్యాడిగెర చెరువులో సంవత్సరం పాటు చేపల పెంపకానికి గురువారం అయా సచివాలయాల ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రచన ఒక ప్రకటనలో తెలిపారు.

పంటల బీమా చెల్లించండి

పెనుకొండ రూరల్: సాగు చేసిన పంటలకు రైతులు బీమా చెల్లించాలని వ్యవసాయ అధికారి చందన తెలిపారు. బుధవారం మండలంలోని కురుభవాండ్లపల్లిలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. వేరుశనగ, టమాట పంటలకు డిసెంబర్ 15 లోపు, వరి పంటకు డిసెంబర్ ఆఖరిలోపు సంబంధిత రుసుము చెల్లించాలన్నారు.

బంజారాలకు అండగా ఉంటాం

సోమందేపల్లి: గిరిజనుల హక్కుల సాధన కోసం బంజారాలకు తాను అండగా ఉంటానని అఖిల భారత బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజినాయక్ తెలిపారు. ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికకావడంతో కదిరి, తనకల్లు, ఓడీ చెరువు మండలాలకు చెందిన గిరిజన సంఘం నాయకులు ఆయన్ను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ నాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

హిందూపురం: హిందూపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లపై పనిభారం మోపుతున్నారంటూ ఎస్ఎంయూఏ నాయకులు ఆర్టీసీ డిపో ఎదుట ఎర్ర బ్యాడ్జీలు ధరించి బుధవారం నిరసన తెలిపారు. రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారెడ్డి, డిపో సెక్రటరీ రంగనాథ్, డిపో చైర్మన్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డిపో మేనేజర్ ఉద్యోగులను భయభ్రాంతులను చేస్తూ అక్రమ ఛార్జ్‌షీట్‌లను ఇస్తున్నారన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

శ్రీశైలం క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసు

హిందూపురం: హిందూపురం ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీకాంత్ అన్నారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఆదివారం సాయంత్రం ఐదుగంటలకు హిందూపురం నుంచి బయలుదేరి సోమవారం శ్రీశైలం, మహానంది పుణ్యక్షేత్రాలు దర్శించడానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. హిందూపురం నుంచి శ్రీశైలం, మహానంది క్షేత్రాల దర్శించి రానుపోను చార్జీలతో కలిసి ఒక్కొక్కరికీ రూ.2 వేలు టికెట్ ఉంటుందన్నారు.

జూదరుల అరెస్టు

రొళ్ల: మండల పరిధిలోని అలుపనపల్లి గ్రామ పొలిమేరలో జూద కేంద్రంపై దాడి చేసినట్లు బుధవారం ఇన్‌చార్జ్ ఎస్ఐ బాలాజీ తెలిపారు. ఐదు మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,640 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. త్వరలోనే నిందితులను కోర్టుకు హాజరుపరుస్తామన్నారు.

ఇన్‌చార్జ్ చైర్మన్‌కు సన్మానం

లేపాక్షి: హిందూపురం మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బలరామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రభాకర్, లక్ష్మినారాయణరెడ్డి సన్మానించారు. బుధవారం హిందూపురం పట్టణంలో మర్యాద పూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.

బోధనా సామర్థ్యాలను పెంపొందించాలి

రొళ్ల: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం మండలంలోని అలుపనపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఎంఈఓ శ్రీధర్ పలు సూచనలు, సలహాలిచ్చారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ఆయా గ్రంథాలయాల్లో బుధవారం ముగింపు కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగానే వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


హిందూపురం అర్బన్: పిల్లల ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని న్యాయవాదులు కళావతి, సంతోషికుమారి, నవేరా, రవిచంద్రలు పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని న్యూ హస్నాబాద్ అంగనవాడీ కేంద్రంలో లోక్ అదాలత్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది గురునాథ్, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు లోక్ అదాలత్ శారద తదితరులు ఉన్నారు.

బాలల హక్కుల వారోత్సవాల ముగింపు

హిందూపురం టౌన్: జిల్లా బాలల పరిరక్షణ సమితి, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని చెర్లోపల్లి ఏపీ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ అధ్యక్షతన అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు ఎక్కువ సేపు మొబైల్‌లో గడుపుతూ పిల్లల కోసం సమయాన్ని వెచ్చించకపోవడం బాధాకరమన్నారు. అనంతరం బాలల హక్కులపై ర్యాలీ చేశారు.

కోర్టులు తరలించడం కక్షసాధింపు చర్యనే

- మాజీ మంత్రి శంకరనారాయణ



హిందూపురం అర్బన్: కర్నూలులో ఉన్న లోకాయుక్త, మానవహక్కుల న్యాయస్థానాలను అమరావతికి తరలించాలని నిర్ణయం తీసుకోవడం కూటమి ప్రభుత్వ కక్షసాధింపులో భాగమేనని మాజీ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణ విమర్శించారు. కర్నూలును న్యాయ రాజధానిగా చేయాల్సింది పోయి ఉన్నవి తరలించడం దారుణమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టులు తరలించడమంటే రాయలసీమకు తీవ్ర అన్యాయం చేయడమేనన్నారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ప్రతి ఒక్కరూ కోర్టుల తరలింపు జరగకుండా అడ్డుకునేందుకు నడుం బిగించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం



రామచంద్రను పరామర్శిస్తున్న వేణురెడ్డి

హిందూపురం: కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడంలో ఉత్సాహం చూపడం కాదు.. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని హిందూపురం నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. హిందూపురం మండలం కొటిపి గ్రామ వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ రామచంద్రప్పను పరామర్శించారు. టీడీపీకి చెందిన నాయకుడిని ఇష్టానుసారం మాట్లాడుతున్నారంటూ పోలీసులు రామచంద్రప్పను అదుపులోకి తీసుకోగా, వేణురెడ్డి సీఐతో మాట్లాడి విడిపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు.

వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిర్ణయమే ఫైనల్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి

గోరంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తీసుకొనే నిర్ణయాలకు పార్టీ శ్రేణులు కట్టుబడి ఉండాలని ఆ పార్టీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముగ్గురు నాయకులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందునే పార్టీ కేంద్ర కమిటీ వారిని సస్పెండ్ చేసిందన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో టౌన్ కన్వీనర్ మేదర శంకర, నాయకులతో కలసి వీరనారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడారు. గోరంట్ల సర్పంచ్ సరోజబాయి భర్త నాగేనాయక్‌తో పాటు కళ్లగేరి శంకరరెడ్డి, వానవోలు ఉపసర్పంచ్ బాబును పార్టీ సస్పెండ్ చేసిందన్నారు. ఆ అక్కసుతో వారు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

కురుబలను రాజకీయంగా చైతన్యపరుస్తాం



వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివను సన్మానిస్తున్న నాయకులు

హిందూపురం: అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాల్లో గెలుపొటములు శాసించే స్థాయిలో జనాభా కల్గిన కురుబ కమ్యూనిటీని రాజకీయంగా చైతన్యపరుస్తాం. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తాము' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ.శివ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివను నియోజకవర్గస్థాయి నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు సన్మానించారు. ముఖ్యమైన పదవిని హిందూపురం నియోజకవర్గానికి కేటాయించినందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వేణురెడ్డి తెలిపారు. పట్టణ, మండల కన్వీనర్లు మన్సూర్, రాము తదితరులు పాల్గొన్నారు.